## గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి దిశగా సింగరేణి



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ శ్రీధర్

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4: సోలార్ విద్యుత్ రంగంలోకి అడుగుపెట్టిన తొలి బొగ్గు కంపెనీగా పేరు తెచ్చుకున్న సింగరేణి మరో భారీ పర్యావరణహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంస్థ పరిధిలోని ప్రస్తుత హైడ్రోజన్ ప్లాంట్‌ను గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌గా మార్చడంతో పాటు స్వీయ నిర్వహణలో రామగుండం రీజియన్‌లోట్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నది. ఈ ప్రక్రియను సీఎండీ శ్రీధర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో విద్యుత్ విభాగం అధికారులను సమీక్షించారు సమావేశంలో సంస్థ డైరెక్టర్ సత్యనారాయణరావు, సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, చీఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ చినబస్విరెడ్డి, జీఎం (సోలార్) జానకీరాం పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

రామవరం, అక్టోబర్ 4: ఎంఎస్ఎం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సింగరేణి సేవా సమితి ద్వారా జూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ఇచ్చేందుకు స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటర్ సాగర్ 95021 90113లో సంప్రదించాలన్నారు.

### రెండోరోజూ సర్టిఫికెట్ల పరిశీలన

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 4: సింగరేణి పరిధిలో ఇటీవల జరిగిన జూనియర్ అసిస్టెంట్ రాత పరీక్షలో అర్హత సాధించిన గ్రేడ్-2 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండోరోజు బుధవారమూ జిల్లాకేంద్రంలోని హెడ్డాఫీసులో కొనసాగింది. అధికారులు అభ్యర్థులను మెడికల్ టెస్టులకు సింగరేణి ప్రధాన ఆస్పత్రికి పంపించారు. మెడికల్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలోనే నియామక పత్రాలను అందజేయనున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ ఆర్‌సీ) బసవయ్య తెలిపారు.

### విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): జిల్లాలో విష జ్వరాలు ప్రబలకుండా పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను జ్వరాల బారి నుంచి కాపాడాలని జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏడు స్థాయీ సంఘాల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. అపరిశుభ్రత వల్లే వ్యాధులు వస్తున్నాయన్నారు. పంచాయతీ అధికారులు, వైద్యాధికారులు సమన్వయంతో పనిచేసి శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, సీఈవో విద్యాలత పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై 'టాస్క్‌ఫోర్స్' దాడి

దమ్మపేట రూరల్, అక్టోబర్ 4: మొద్దులగూడెం శివారులోని పేకాట స్థావరంపై బుధవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో కొందరు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని అందిన సమాచారంతో సిబ్బంది దాడులు నిర్వహించారు. పదిమంది అక్కడి నుంచి పరారవగా పోలీసులు ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.61,300 నగదుతో పాటు ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేయించారు.

### సీసీ కెమెరాలు ధ్వంసం.. కేసు నమోదు

చింతకాని, అక్టోబర్ 4: రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలలో 'మన ఊరు-మన బడి'లో భాగంగా సీసీ కెమెరాలను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం సీసీ కెమెరాల ధ్వంసాన్ని గుర్తించిన హెచ్ఎం మాధవీదేవి పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై ఆలకుంట రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వరకట్న వేధింపులపై..

చింతకాని, అక్టోబర్ 4: ఏన్కూరు మండలం ఇందిరానగర్‌కాలనీకి చెందిన నలుగురిపై చింతకాని పోలీస్ స్టేషన్‌లో వరకట్న వేధింపులపై కేసు నమోదైంది. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొదుమూరుకు చెందిన పార్వతికి 2011లో ఇందిరానగర్ కాలనీకి చెందిన రమేశ్‌తో వివాహమైంది. కొన్నేళ్ల వరకు వారి వైవాహిక జీవితం బాగానే ఉంది. పార్వతిని ఆ తర్వాత భర్తతోపాటు అత్త, ఇద్దరు తోటి కోడళ్లు అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. వేధింపులకు తాళలేని బాధితురాలు బుధవారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు చింతకాని పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# మధిర రూరల్ పీఎస్ 'ది బెస్ట్'

మధిర రూరల్, అక్టోబర్4: తెలంగాణ పోలీస్‌శాఖ రాష్ట్రవ్యాప్తంగా 30 పోలీస్ స్టేషన్లను ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా గుర్తించగా వీటిలో 'మధిర రూరల్ పీఎస్' స్థానం సాధించింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ప్రకటన వెలువడింది. పీఎస్ పరిధిలో సొత్తు రికవరీ శాతం ఎక్కువగా ఉండడం, చోరీలు, మిస్సింగ్, మహిళలపై వేధింపులకు కేసులు తక్కువగా నమోదవుతుండడం వంటి అంశాలు ఉత్తమ పీఎస్‌గా ఎంపికకావడానికి గల కారణాలు. 1990లో తొలుత రూరల్ పోలీస్ స్టేషన్ అద్దె భవనంలో ప్రారంభమైంది. నిన్నమొన్నటి వరకు అక్కడే పీఎస్ కొనసాగింది. ఇటీవల ఖాజీపురంలో నిర్మించిన భవనంలోకి పీఎస్ మారింది. ఎస్‌హెచ్‌వోతోపాటు పోలీస్ సిబ్బంది శాంతి భద్రతలను పరిరక్షిస్తూ నిబద్ధతతో పనిచేయడంతోనే పీఎస్‌కు పోలీస్‌శాఖ గుర్తింపు లభించింది. త్వరలో పీఎస్ పురస్కారాన్ని అందుకోనున్నది. ఈ సందర్భంగా ఎస్సై మహమ్మద్ ఉపాతల్ రఫీ మాట్లాడుతూ.. పీఎస్ రాష్ట్రంలోనే ఉత్తమ పీఎస్‌గా ఎంపిక కావడం ఆనందాన్నిచ్చిందని, ఎంపిక తమలో బాధ్యతను పెంచుతున్నదన్నారు.



# సామాన్యుడి ఖాతాలే సైబర్ నేరగాళ్ల టార్గెట్

#### సైబర్ క్రైం డీఎస్పీ కృష్ణయ్య

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 4: సామాన్యుడి ఖాతాలో సొమ్మును కాజేయడమే సైబర్ నేరగాళ్ల లక్ష్యమని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండడమే సరైన మార్గమని సైబర్ క్రైం డీఎస్పీ ఎ.కృష్ణయ్య అన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు ప్రజల మొబైల్స్‌కు వెబ్‌సైట్ లింకులు పంపిస్తారని, వాటిని తెరిచిన వెంటనే సొమ్ము కాజేసేందుకు కాచుకు కూర్చుంటారన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియాల ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని తల్లిదండ్రులు, బంధువులకూ అవగాహన కల్పించాలన్నారు. ఒక్క భద్రాద్రి జిల్లాలోనే ఈ ఏడాదిలో రూ.7 కోట్ల వరకు సైబర్ నేరగాళ్లు దోచుకున్నారన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించి వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)ను చెప్పొద్దన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 'సైబర్ వారియర్స్' పేరుతో వాట్సాప్ గ్రూపులు నడుపుతున్నామన్నారు. ప్రతి ఏరియాకు చెందిన యువతను ఆ గ్రూపుల్లోకి తీసుకొస్తున్నామన్నారు. సైబర్ నేరాల బారిన పడిన వారు టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శారద, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ సముద్రాల జీతేందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌కుమార్, షీ టీం ఇన్‌చార్జి ఎస్సై రమాదేవి, ఏహెచ్‌టీయూ ఎస్సై వాసికర్ల శ్రీనివాసరావు, పోలీస్ పీఆర్వో దాములూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న సైబర్ క్రైం డీఎస్పీ కృష్ణయ్య, హాజరైన కళాశాల సిబ్బంది, విద్యార్థినులు

## గర్భిణి ఆత్మహత్య

#### సమాచారం తెలుసుకున్న భర్త ఆత్మహత్యాయత్నం

పినపాక, అక్టోబర్ 4: వాళ్లిద్దరూ ప్రేమించుకున్నారు.. పెద్దలను ఒప్పించి కులాంతర వివాహం చేసుకున్నారు.. కొన్నాళ్లు సంతోషంగా జీవిస్తున్నారు. భార్య భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నది. భర్త 108 డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ కలహాలో లేక ఇంకేదైనా బలమైన సమస్యో తెలియదు గానీ భార్య ఉరేసుకుని ప్రాణం తీసుకున్నది. అప్పటికే ఆమె ఎనిమిది నెలల గర్భిణి. భార్య మృతిని తట్టుకోలేని భర్త కూడా ఆత్మహత్య చేసుకోవాలనుకుని పురుగు మందు తాగాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉప్పాక పంచాయతీకి చెందిన సాయికుమార్, స్వప్న (30) కొన్నేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుని స్వగ్రామంలోనే నివాసం ఉంటున్నారు. స్వప్న నిర్వాసితురాలి కోటాలో బీటీపీఎస్‌లో కొలువు చేస్తున్నది. సాయికుమార్ 108 అంబులెన్స్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వారిద్దరి మధ్య ఏం జరిగిందో తెలియదు గానీ బుధవారం మధ్యాహ్నం స్వప్న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. సమాచారం అందుకున్న భర్త వెంటనే పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు సాయికుమార్‌ను భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వప్న మృతిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం అపస్మారకస్థితిలో సాయికుమార్ చికిత్స పొందుతున్నాడు.

## సింగరేణిలో క్రీడలకు ప్రోత్సాహం

#### ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, అక్టోబర్ 4: సింగరేణి యాజమాన్యం క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడలకు ప్రాధాన్యం ఇస్తుందని సంస్థ ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీ సీఈఆర్ క్లబ్‌లో బుధవారం ఆయన కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. యాజమాన్యం పని ఒత్తిడి తగ్గించేందుకు ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పంజాల శ్రీనివాసు, జీవీ మోహన్‌రావు, యూనియన్ల నాయకులు రంగనాథ్, నజీర్, జగన్నాథం, బాలప్రసాద్, సిరాజ్ అహ్మద్, సీతారామయ్య పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ చేస్తున్న జీఎం జాన్ ఆనంద్

### అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

అశ్వారావుపేట, అక్టోబర్ 4: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన బుధవారం బచ్చువారిగూడెంలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం తెల్లపల్లికి చెందిన మడకం వెంకప్ప (72) మంగళవారం అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెంలో నివాసం ఉంటున్న చిన్న కుమారుడు మడకం రాముడు ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంట్లోనే నిద్రించిన వెంకప్ప బుధవారం తెల్లవారుజామున విగత జీవుడిగా కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ కరుణాకర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు.

### వృద్ధుడి ఆత్మహత్య

పాల్వంచ, అక్టోబర్ 4: పాల్వంచకు చెందిన చెలిమల రామకృష్ణ (60) అనే వృద్ధుడు బుధవారం శ్మశానవాటిలో ఉరేసుకున్నాడు. గతేడాది అనారోగ్యంతో భార్య మృతిచెందగా అప్పటినుంచి వెంకటేశ్వర్లు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కేంద్ర వైద్య బృందం పర్యటన

చింతకాని, అక్టోబర్ 4: నాగులవంచ పల్లె దవాఖాన, వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం జాతీయ వైద్య బృంద సభ్యులు నాగిరెడ్డి, అమర్‌జ్యోతి, సైదులు పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై వైద్యాధికారి తోళ్ల వెంకటేశ్వరరావును ఆరా తీశారు. ప్రసవాల గది, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డు, ల్యాబ్‌లో కలియ దిరిగి వైద్యసిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



పల్లె దవాఖాన స్టాకు పరిశీలిస్తున్న జాతీయ వైద్యబృందం